సాక్షి నంద్యాల

ఆదివారం, 2, ఏప్రిల్, 2023



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉండగా కేసీ కాల్వకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.



సిద్దేశ్వరునికి కిరణాభిషేకం

హొళగుంద: చీకటిగా ఉండే గర్భగుడిలోకి శనివారం సూర్యకిరణాలు ప్రవేశించాయి. శ్రీ సిద్దేశ్వరస్వామిని తాకాయి. దీంతో హొళగుంద ప్రజలు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:49
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:52
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:52
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:46
బనగానపల్లె	సా॥ 6:39	ఉ॥ 4:46

హదీస్ వెలుగు :
అబద్ధాలు చెప్పడం చాలా పాపం. అల్లాహ్ వీరి ప్రార్థనలు అంగీకరించరు. రోజా ఉండి అబద్ధాలు చెబితే రోజా కూడా దీలా పడుతుంది. అంతటి పాపం చేకూర్చే అబద్ధం నుంచి నియంత్రణలో ఉండండి. – పవిత్ర ఖురాన్

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- గతంలో 11 ప్రశ్నాపత్రాలు.. ఈ ఏడాది ఆరు మాత్రమే
- 125 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 25,411 మంది విద్యార్థులు
- ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా
- 125 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 1,341 మంది ఇన్విజిలేటర్ల నియామకం



రుద్రవరం మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న సిబ్బంది

నంద్యాల: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 3వ తేదీన ప్రారంభమై 18వ తేదీ వరకు జరుగనున్నాయి. నంద్యాల జిల్లాలో 22,661 మంది రెగ్యులర్, 2,753 మంది ప్రైవేటు.. మొత్తం 25,411 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిలా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు 125 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఇన్విజిలేటర్లకు, డిపార్ట్‌మెంట్ అధికారులకు, పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన నియమ నిబంధనలపై విద్యార్థులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణకు 125 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 125 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. వీరితో పాటు 5 ఫ్లయింగ్ స్క్వాడ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 1,341 మందిని ఇన్విజిలేటర్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించారు.

ఈ ఏడాది ఆరు ప్రశ్నాపత్రాలే..

గతంలో 11 ప్రశ్నాపత్రాలు ఉండగా.. ఈ ఏడాది ప్రభుత్వం వాటిని కుదించి ఆరు ప్రశ్నాపత్రాలుగా మార్పు చేసింది. సైన్స్‌కు సంబంధించిన జీవ, రసాయన, భౌతిక శాస్త్రాలు ఒకే పరీక్షగా నిర్వహిస్తారు. ఒక్కో విద్యార్థికి ముందుగా 24 పేజీల జవాబు పత్రం ఇస్తారు. అది పూర్తిగా రాసిన విద్యార్థులు కావాలంటే మరో 12 పేజీలు ఉండే జవాబు పత్రం తీసుకోవచ్చు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా జవాబు పత్రాలపై వరుస సంఖ్య ఉంటుంది. ఒక విద్యార్థి పత్రాలు, మరొకరి వద్ద ఉంటే సులభంగా గుర్తించి చూసి రాతను అరికట్టవచ్చు.



రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలోకి బెంచీలను చేర్చుతున్న దృశ్యం

ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో..

జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల, బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురంలోని ఉన్నత పాఠశాల, గడివేముల, రుద్రవరం, శిరివెళ్ల, నందికొట్కూరు బాలికల పాఠశాలలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరు సిట్టింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నారు.

నో సెల్ జోన్లుగా పరీక్ష కేంద్రాలు..

పది పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, మాస్ కాపీయింగ్ వంటి వాటికి అడ్డకట్ట వేసేందుకు పరీక్ష కేంద్రాలన్నింటిని నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు ఉచితంగా బస్సులు నడుపుతున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. 100 మీటర్ల లోపు జిరాక్స్ దుకాణాలు, ఇంటర్నెట్ కేంద్రాలను తెరిచి ఉంచకూడదు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్నాయి. ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,149 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 8 కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,653 మంది పరీక్షకు హాజరు కానున్నారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగనున్నాయి. ఆత్మకూరు, నంద్యాల, డోన్ జూనియర్ కళాశాలలను కేంద్రాలుగా ప్రకటించారు. 543 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు.

వేసవి నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు



వేసవిలో ఎండ తీవ్రతకు విద్యార్థులు నీరసించే అవకాశం ఉంది. వాంతులు, జ్వరం, కడుపునొప్పి, పరీక్షల భయంతో కళ్లు తిరిగి పడిపోవడం వంటివి జరిగే అవకాశం ఉంది. ఈ మేరకు పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాల్లో అన్ని రకాల మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతాం. ఆశా వర్కర్, ఏఎన్‌ఎం పరీక్షా కేంద్రాల వద్ద ఉంటారు. విద్యార్థికి ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించడానికి 104 వాహనం అందుబాటులో ఉండనుంది.

– వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు



పరీక్ష కేంద్రానికి వచ్చిన ప్రతి విద్యార్థి ఇబ్బంది పడకుండా ప్రశాంతంగా పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరిచాం. వేసవి నేపథ్యంలో విద్యార్థులకు మంచినీరు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచుతున్నాం. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు అందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులను టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించారు.

– అనురాధ, డీఈఓ, నంద్యాల

రేపటి నుంచి ఒంటిపూట బడులు

నంద్యాల(సిటీ): జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒంటిపూట బడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాలల నిర్వహణ జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒంటి పూట బడులను నిర్వహించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తర్వాత వారి గృహాలకు పంపించాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. దాతల సహకారంతో మధ్యాహ్నం విద్యార్థులకు మజ్జిగ అందించాలని సూచించారు.

స్పాట్ వ్యాలూయేషన్‌కు హాజరు కావాలి

నంద్యాల(సిటీ): పరీక్ష పత్రాల మూల్యాంకన ఆర్డరు వచ్చిన లెక్చరర్లు తప్పకుండా స్పాట్ వ్యాలూయేషన్ క్యాంపు-10 కర్నూలు (ప్రభుత్వ జూనియర్ కళాశాల)కు హాజరు కావాలని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి గురువయ్యశెట్టి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హాజరు కాకపోతే కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. రిజర్వ్‌లో ఉన్న లెక్చరర్లు కూడా కచ్చితంగా హాజరు కావాలన్నారు.

పన్ను వసూళ్లలో 5వ స్థానం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచిందని మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ అధికారి వరప్రసాద్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను చెల్లింపులో వడ్డీ రాయితీ కల్పించడంతో పట్టణంలో అత్యధిక మంది ఇంటి, నీటి, ఖాళీస్థలాల పన్నులు చెల్లించారన్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఇంటి పన్నుల రూపంలో రూ. 19,08,94,962, ఖాళీ స్థలాలకు రూ. 62,64,329, నీటి పన్ను రూ.3,18,2,174 వసూలు కాగా, మొత్తం రూ. 22,89,83,465 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

సంగమేశ్వరుడి సేవలో..



తెలంగాణ హైకోర్టు జడ్జి దంపతులకు స్వాగం పలుతున్న పురోహితులు

కొత్తపల్లి: సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని తెలంగాణ హైకోర్టు జడ్జి సాంబశివ నాయుడు దంపతులు సందర్శించారు. వారికి ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా సప్తనదుల సంగమ ప్రాంతాన్ని తిలకించారు. అనంతరం వేపదారు శివలింగానికి పుష్పార్చన, క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు జడ్జి సాంబశివనాయుడు దంపతులను ఆలయ పురోహితులు సత్కరించారు. వారికి ఆలయ పూర్వ చరిత్రను వివరించారు.

రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలో రైతులందరూ ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2022-23 రబీ పంట కాలానికి సంబంధించి జిల్లాలో 4.08 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయన్నారు. అందులో 3.94 లక్షల ఎకరాలకు రైతులు ఈ కేవైసీ చేయించుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన 3.47 శాతం మంది రైతులు కూడా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఏప్రిల్ 10 వరకు ఈకేవైసీ చేయించుకొనేందుకు గడువు ఉందని, కావున ప్రతి రైతు చేయించుకోవాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో శనివారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలకు 4,126 మంది విద్యార్థులకు గాను 3,802 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 4,644 మంది విద్యార్థులకు గాను 4,093 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

రేపు శ్రీశైలంలో అఖిల భారత హిందూ మహాసభ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం వెనుక ఉన్న గురుసదన్ ప్రాంగణంలో సోమవారం అఖిలభారత హిందూ మహాసభను నిర్వహిస్తున్నట్లు శ్రీయోగి అతిదేశ్వరానంద పర్వత స్వామిజీ ధర్మాచార్య సంస్థాన్ ప్రధాన కార్యదర్శి శనివారం తెలిపారు. కార్యక్రమానికి మిషన్‌మోడీ జాతీయ అధ్యక్షుడు రామ్‌విలాస్‌దాస్ వేదాంతి, అయోధ్య దేవాలయం లీగల్ అడ్వైజర్ రామ్‌నారాయణదాస్, అఖిల భారత హిందూ జాతీయ అధ్యక్షుడు త్రిదండిబ్రటగర స్వామిజీ, రాష్ట్ర అధ్యక్షుడు రామాయణం మహేష్‌స్వామి తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. సనాతన ధర్మప్రచారంలో భాగంగా పురాతన హరికథలు, సంకీర్తనలు, భజన మండళ్ల స్థాపనలను బలోపేతం చేయడమే ప్రధానాంశమన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై కేసు నమోదు

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాల సివిల్ సప్లయ్ గోడౌన్‌లో 2018లో విధులు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులుపై టూటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రామాంజనేయులు నంద్యాల సివిల్ సప్లయ్ గోడౌన్ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించిన సమయంలో బియ్యం, గోధుమ, చక్కెర, కందిపప్పు, నూనె, తదితర నిత్యావసర సరుకులను అక్రమంగా బయటకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి సివిల్ సప్లయ్ అధికారులు రామాంజనేయులుపై విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం సివిల్ సప్లయ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజునాయక్ టూటౌన్ పోలీసులకు గత నెల 28వ తేదీ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూ.64 లక్షల విలువ గల నిత్యావసర సరుకులు అక్రమంగా తరలించి అధికారులను మోసం చేశారని చీటింగ్ కేసు నమోదు చేశారు. రామాంజనేయులు 2018 ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందడంతో ఆయనకు ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్‌ను నిలుపుదల చేశామని, కేసు రుజువైతే ఆ బెనిఫిట్స్ నుంచి రూ.64 లక్షలు వసూలు చేస్తామని రాజునాయక్ పేర్కొన్నారు.



హే.. 'భగ'వాన్

ఎండలు రోజురోజుకు పెరుగుతున్నాయి. జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయంలో అవస్థలు పడుతున్నారు. ఆలయ అధికారులు చలువ పందిళ్లు, కార్పెట్లు వేయకపోవడంతో ఎండ వేడిమికి కాళ్లు మండి పరుగులు పెడుతున్నారు. – మహానంది

కాళ్లు మండిపోతుండటంతో పరుగులు పెడుతున్న భక్తులు



బాబోయ్...కాళ్లు మండిపోతున్నాయ్



అధికారుల నిర్లక్ష్యంతోనే వెండి మాయం

- సొత్తు చోరీపై హార్డ్ క్రిమినల్ విచారణ చేశాం
- వీసీ, హెచ్‌సీతో పాటు సహకరించిన మరో ఇద్దరు అరెస్టు
- రూ.10 లక్షల నగదు, 81.52 కేజీల వెండి సీజ్
- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: ''వాహన తనిఖీల్లో పట్టుబడి కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచిన వెండి, నగదు అధికారుల నిర్లక్ష్యం వల్లే మాయమయ్యాయి. ఈ ఘటన జరగడం బాధాకరం. డీఎస్పీ స్థాయి అధికారితో హార్డ్ క్రిమినల్ విచారణ చేశాం. శాఖాపరమైన విచారణ కొనసాగుతోంది. అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తేలితే చర్యలు ఉంటాయి'' అని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడించారు. పోలీస్ స్టేషన్‌లో 105 కిలోల వెండి, రూ.2.05 లక్షల నగదును చోరీ చేసిన హెడ్ కానిస్టేబుల్ అమరావతి, కానిస్టేబుల్ రమణబాబు, వారికి సహకరించిన అమరావతి భర్త విజయభాస్కర్, అతని తమ్ముడు భరత్‌సింహాలను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఎదుట హాజరుపరిచారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, డీఎస్పీలు కేవీ మహేష్, యుగంధర్ బాబుతో కలసి జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం నిర్వహించి ఎస్పీ వివరాలు వెల్లడించారు. వివరాలు ఎస్పీ మాటల్లోనే..

2021 జనవరి 27వ తేదీన అప్పటి తాలూకా సీఐ విక్రమ సింహా పోలీసు సిబ్బందితో కలసి కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రం సేలం పట్టణానికి చెందిన సందన్ భారతి గోవిందరాజ్ వాహనాన్ని తనిఖీ చేయగా ఆధారాలు లేని 105 కిలోల వెండి వస్తువులు, రూ.2.05 లక్షల నగదు బయటపడింది. వాటిని సీజ్ చేసి స్టేషన్‌లో భద్రపరిచేందుకు అప్పటి రైటర్ రమణబాబుకు అప్పగించారు. తదుపరి చర్యల నిమిత్తం కమర్షియల్ ట్యాక్స్ శాఖకు లెటర్ రాయగా వెండి వస్తువులకు సంబంధించి బిల్స్ తనిఖీ చేసి రూ.35 లక్షలు అపరాధ రుసుం విధించారు. పోలీస్ స్టేషన్ ఫస్ట్ ఫ్లోర్‌లో స్టాఫ్ రూముకు పక్కన ఉన్న ప్రాపర్టీ రూమ్‌లో వెండిని భద్రపరచి రూ.2.05 లక్షల నగదును మాత్రం అధికారులకు తెలియకుండా రమణ బాబు సొంత ఖర్చులకు వాడుకున్నారు. అతను అక్కడి నుంచి బదిలీ అయ్యాక తర్వాత రైటర్‌గా పనిచేసిన అమరావతికి ఆ డబ్బుతో పాటు వెండిని కూడా అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది.

ఎవరూ లేని సమయంలో చోరీ

ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేసేందుకు 2022 మే 24వ తేదీన సీఐ, ఎస్ఐతో పాటు సిబ్బంది బయటకు వెళ్లారు. హెడ్‌కానిస్టేబుల్ అమరావతి ఇంటికి వెళ్లి రాత్రి 11.30 గంటలకు సివిల్ డ్రస్సులో స్టేషన్‌కు వచ్చింది. ఆ సమయంలో సెంట్రీ తప్ప ఎవరూ లేరని గమనించి అతనితో ఐదు నిమిషాలు మాట్లాడి ఇంటికి వెళ్లిపోయి తెల్లవారుజామున 2-3 గంటల మధ్యలో భర్త విజయ్‌భాస్కర్‌తో కలసి స్టేషన్ కాంపౌండ్‌లోకి చేరుకుని అప్పటికే సీఐ రూమ్ వెనుక తెరిచిపెట్టుకున్న గ్రిల్ లేని కిటికీలో నుంచి సీఐ గదిలోకి భర్తను పంపించి బీరువాలో భద్రపరచిన రెండు బ్యాగులలో ఉన్న వెండిని దొంగలించారు. మరిది భరత్ సింహా సహాయంతో 23 కేజీల వెండిని కరిగించి నగదుగా మార్చుకున్నారు. సొమ్ము యజమాని భారతి గోవిందరాజ్ కమర్షియల్ ట్యాక్స్ విధించిన ఫైన్‌ను చెల్లించి రిలీజ్ ఆర్డర్ పొంది స్టేషన్‌కు రావడంతో చోరీ విషయం బయటపడింది. చోరీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో తనను అరెస్టు చేసి ఉద్యోగం కూడా తీయిస్తారని అమరావతి భావించి దొంగిలించిన వెండిని విక్రయించి నగదుగా మార్చుకుని హైకోర్టులో బెయిల్ తీసుకుందామని కియా కారులో పారిపోతుండగా పక్కా సమాచారం మేరకు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు, 81.52 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు'' అని ఎస్పీ వెల్లడించారు.

నేడు వాల్మీకుల మహా ప్రదర్శన

గూడూరు: వాల్మీకుల చిరకాల కోరికను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం కర్నూలులో మహా ప్రదర్శన, భారీ సభను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి బోయ, వాల్మీకులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌తో కలిసి వాల్మీకి నాయకులతో గూడూరు పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ స్పందించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించారన్నారు. జోనల్ వ్యవస్థ ద్వారా ఎవరికీ నష్టం వాటిల్లకుండా సీఎం కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని మండి పడ్డారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

క్లుప్తంగా

జాబ్‌మేళాలతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి

నంద్యాల(అర్బన్): జాబ్ మేళాల నిర్వహణ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్–20, సిగ్ని–50, అరవిందో ఫార్మసీ–40 తదితర ప్రముఖ కంపెనీలకు సంబంధించి జాబ్ మేళా నిర్వహించారు. జిల్లాలోని 480 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కాగా 110 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు.

యువతి అదృశ్యం



పరిమళ (ఫైల్)

మిడుతూరు: తలముడిపి గ్రామానికి చెందిన మేకల బాలచెన్నయ్య తన కుమార్తె పరిమళ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇరుగు పొరుగు వారిని విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలచెన్నయ్య పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కృష్ణగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య వైద్య సిబ్బందికి సూచించారు. కృష్ణగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అందించే అన్ని సేవలను వందశాతం అమలు అయ్యేలా చూడాలన్నారు. అనంతరం వెల్దుర్తి మండలం కొసనాపల్లెలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

సూపరింటెండెంట్లు ఇక అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు

కర్నూలు కల్చరల్: అటవీశాఖలోని మేనేజర్లు, సూపరింటెండెంట్లు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ల హోదా పొందారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. హోదా మారినప్పటికీ వేతనంలో ఎలాంటి మార్పు ఉండదని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక మేనేజర్, ఏడుగురు సూపరింటెండెంట్లు.. మొత్తం 8 మంది హోదా మారింది. దీంతో అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ కర్నూలు కార్యాలయం ఏవో టి. రామచంద్ర రావు, ప్రధాన కార్యదర్శి సి. మహమ్మద్ అసేన్ హర్షం వ్యక్తం చేశారు.

సర్వపాప హరణం.. ఖురాన్ పఠనం


- 30 భాగాలు.. ఒక్కో భాగానికి ఒక్కో అర్థం
- ప్రతి ముస్లిం పఠించడం తప్పనిసరి
- చదువు రాని వారు కనీసం శ్రద్ధగా వినాలి



కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసంలో వెలువడింది దివ్య గ్రంథం ఖురాన్. అందుకే రంజాన్‌కు ఖురాన్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. 'రమ్‌దామ్' అనే రబ్బీ పదం కాలక్రమేణా 'రంజాన్'గా మారింది. పాప పరిహారాల కోసం ఈ నెల అనువైనది. ఈ మాసంలో ఖురాన్ పూర్తిగా వినడం మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం ఆచారం. హజరత్ జిబ్రయీల్ అలైసలాం ఏటా రంజాన్ మాసంలో మహా ప్రవక్త (స)కు సంపూర్ణ ఖురాన్ వినిపించేవారు. ఆయన ఆఖరి సంవత్సరంలో మహా ప్రవక్తతో పాటు రెండు సార్లు ఖురాన్‌ను సంపూర్ణంగా పఠించారు. అందువల్ల ఈ మాసంలో అత్యధికంగా ఖురాన్ పఠించడానికి ప్రయత్నించాలి. ఖురాన్‌ను నెమ్మదిగా, అవగాహన చేసుకుంటూ చదవాలి. వజూ చేసిన తరువాత ఖురాన్‌ను పఠించడం ఉత్తమం. ప్రతిరోజూ ఖురాన్‌ను చదవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఈ గ్రంథంలోని 30 భాగాలను (పారా) కంఠస్థం చేసిన వారిని ఖురానే హాఫీజ్ అంటారు. వీరు ఏటా రంజాన్ మాసంలో రాత్రి చదివే ప్రత్యేక తరావీహ నమాజులో ఖురాన్‌ను చదివి వినిపిస్తారు. తరావీహ నమాజులో ఖురాన్‌ను పూర్తిగా వినేందుకు ప్రయత్నించాలి.

రోజూ ఒక భాగం:

పవిత్ర మాసం రంజాన్‌లో రాత్రి ఇషా నమాజు తరువాత చదివించే తరావీహ నమాజుకు ఎంతో విశిష్టత ఉంది. మిగిలిన 11 నెలల్లో ఇది ఉండదు. చదవాలనీ లేదు. మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం తప్పని సరిగా పాటించినందుకు దీనిని సున్నత్‌గా పరిగణించారు. ఈ నమాజులో ప్రతి రోజూ ఒక భాగం చొప్పున నెలలో పూర్తి ఖురాన్ చదివి వినిపిస్తారు. చదవడం రాని వారు తరవీహ నమాజు చేస్తే కనీసం పూర్తి ఖురాన్ శ్రద్ధగా వినవచ్చు.



ఖురాన్ పఠిస్తున్న దృశ్యం

దివ్య గ్రంథం



దివ్య గ్రంథం ఖురాన్ పవిత్ర రంజాన్ మాసంలో వెలువడింది. ఈ గ్రంథాన్ని చదివేందుకు వయస్సుతో పని లేదు. కేవలం చదవడం కాదు.. అర్థం కూడా తెలిసి ఉంటేనే అందులోని పదాల మహత్యం తెలుస్తుంది.

– మౌలానా అబ్దుల్ ఖావి జబీద్, కర్నూలు.

మహా పుణ్యం



ఖురాన్ పఠించడం ద్వారా సకల పాపాలు హరిస్తాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో దీని పఠనం తప్పని సరి. ఒక్క సారి చదివితే 70సార్లు చదివిన పుణ్యం అల్లాహ్ మనకు ప్రసాదిస్తారు. ప్రతి ఒక్కరూ దీనిని నేర్చుకోవడం మంచిది. 30 భాగాల్లో ఎన్నో అర్థాలు, పరమార్థాలున్నాయి. ఆకాలంలో ఇందులోని కలిమా, ఆయత్, సూరాలు చదివి రోగాలను నయం చేసేవారు.

– హాఫిజ్ గఫూర్, ఖురానే హాఫీజ్, గోనెగండ్ల.

ఖురాన్ గణాంకాలు

పవిత్ర ఖురాన్‌లో 30పారాలు (భాగాలు) ఉన్నాయి. 32,12,670 ముకమ్మల్ ఉర్ఫే (అక్షరాలు), 6,666 ఆయతే (వాక్యాలు), 540 రుకులు (ఫుల్‌స్టాప్‌లు), 114 సూరాలు (వచనాలు) ఉన్నాయి. వీటితో పాటు 14 సిజ్దాహ్ (సాష్టాంగా ప్రణామాలు) ఉన్నాయి. ఖురాన్‌లో పదాలను ఆయత్ అంటారు. రంజాన్ మాసంలో ఒకసారి చదివితే సాధారణ రోజుల్లో 70 సార్లు చదివిన పుణ్యం లభిస్తుంది. ఇది 1,400 సంవత్సరాల క్రితం అవిర్భవించింది. హజరత్ ఇబ్రహీమ్‌కు రంజాన్ మాసంలోనే మొదటి లేదా మూడో తేదీన పవిత్ర ఖురాన్ గ్రంథం ప్రసాదితమైంది. హజరత్ దావూద్‌కు ఈ నెలలో 12 లేదా 18వ తేదీల్లో జబూర్ గ్రంథం సిద్ధించింది.

కల్యాణమస్తుకు 30 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(అర్బన్): పేదింటి ఆడబిడ్డల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద ఆర్థిక సహాయం పొందేందుకు వివాహమైన 30 రోజుల్లో సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలక్రిష్ణారెడ్డి చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర జీఓ జారీ చేశారన్నారు. గతంలో వివాహం అయిన అనంతరం 60 రోజుల్లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం సమయాన్ని 30 రోజులకు కుదించారన్నారు. జిల్లాలో 2022 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 692 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో అర్హులైన 271 మందికి రూ.2.31 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి మే నెలలో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.1 లక్ష, కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకుంటే రూ.75 వేలు, మైనారిటీలకు రూ.1 లక్ష, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు అందించడం జరుగుతుందన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

కర్నూలు: మద్యం తాగొద్దన్నందుకు కర్నూలు ప్రకాష్‌నగర్‌కు చెందిన చాకలి శ్రీనివాసులు (53) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన గత నెల 20వ తేదీన భార్య సావిత్రమ్మతో గొడవ పడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కనిపించడం లేదని కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి పొద్దుపోయాక పత్తి పొలంలో నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానంటూ చెప్పి సెల్ స్విచ్ఛాఫ్ చేశాడు. కుటుంబ సభ్యులు అతని కోసం కర్నూలు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా కనిపించలేదు. శ్రీనివాసులు, సావిత్రమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం కాగా అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. భార్యతో పాటు కుటుంబ సభ్యులంతా వారం రోజులుగా వెతుకుతుండగా మద్యం సేవించేందుకు పొలంలోకి వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని చూసి పంచలింగాల తలారి ద్వారా వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. ఆయన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్ ఎస్‌ఐ ఎర్రన్న శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

''పక్షవాతం జబ్బుతో బాధ పడుతున్నావు.. మద్యం సేవిస్తే జబ్బు నయం కాదు'' అంటూ మందలించినందుకే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎర్రన్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- అదుపు తప్పి స్కూటీని ఢీకొట్టిన బొలేరో
- శ్రీశైలాలయ అర్చకుడు మృతి
- బొలేరోలోకి దూసుకెళ్లిన రైలింగ్ రేకు
- అందులో ఉన్న మాచర్ల వాసి మృతి







బోల్తా పడిన బొలెరో వాహనం, చనిపోయిన కొరటా వెంకటేశ్వర్లు (ఫైల్), అర్చకుడు శివనాగప్రసాద్

శ్రీశైలం: శ్రీశైలం – దోర్నాల ఘాట్ రోడ్డులో శిఖరేశ్వరం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ అర్చకులు శివనాగప్రసాద్ (42) ఉదయం ఆత్మకూరు సమీపంలోని ముష్టపల్లెలో జరిగే పార్వేట పూజలు నిర్వహించేందుకు స్కూటీపై బయలుదేరాడు. మార్గమధ్యలో శిఖరేశ్వరం వద్ద మలుపులో దోర్నాల వైపు నుంచి శ్రీశైలానికి వేగంగా వస్తున్న బొలేరో వాహనం మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివనాగప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. బొలేరో వాహనం పక్కనే ఉన్న రైలింగ్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో రైలింగ్ ఇనుప రేకు బొలేరోలోకి దూసుకెళ్లి అందులో ఉన్న మాచర్ల వాసి కొరటా వెంకటేశ్వర్లు (35) కడుపును చీల్చడంతో మృతి చెందాడు. అందులో ఉన్న మరో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని ప్రాజెక్ట్ కాలనీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండటంతో సమాచారం అందుకున్న దోర్నాల ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని బొలేరో వాహనంలో చిక్కుకున్న వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఎంతో శ్రమించారు. మృతుడు శివనాగప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

ఇక నుంచి ఉచితంగా 'కృత్రిమ గర్భధారణ'

కర్నూలు(అగ్రికల్చర్): మేలు జాతి పశుసంపదను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా కృత్రిమ గర్భధారణ సూదులు వేయాలని నిర్ణయం తీసుకుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశం ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కృత్రిమ గర్భధారణ సూదికి రూ.40 వసూలు చేస్తున్నారని, ఇక నుంచి ఉచితంగా వేయనున్నారన్నారు.

OFFICE OF THE COMMISSIONER AND DIRECTOR OF AGRICULTURAL MARKETING
Government of Andhra Pradesh, Guntur.

E-PROCUREMENT TENDER NOTICE

E-procurement T.No.CE(AM)/APIGNT/Ev31/2022-23, Dated: 31-3-2023

Online tenders are invited by the Chief Engineer (AM) Guntur from the registered Civil Contractors & Reputed Firms & Manufacturers for constructional works at various Market Yards in **Kadapa, Kurnool, Ananthapuram & Nellore District** costing of Rs. 5,73,24,926/- approximately. Eprocurement site opens on **Dt. 3-4-2023 at 4.00 P.M.** Any other information can be had from the **www.tender.apeprocurement.gov.in** or from the office of the Chief Engineer (AM), O/o. Commr. & Director of Agrl. Marketing, Chuttugunta Center, Guntur.

Sd/- Chief Engineer (AM),
O/o. Commissioner and Director of Agrl. Marketing, Govt. of A.P, Guntur

అక్రమ మైనింగ్‌పై లోకాయుక్త ఆగ్రహం

- విచారణ జరపాలని మైనింగ్ శాఖ డైరెక్టర్, నంద్యాల కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు

కర్నూలు(సెంట్రల్): డోన్ నియోజకవర్గంలోని చిన్నమల్కాపురం, పెద్దమల్కాపురం, జలదుర్గం, కొచ్చెర్వు, బావాయిపాలెం, చంద్రపల్లె గ్రామాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. భూగర్భ ఖనిజాల కోసం 100 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరిపి పర్యావరణ అసమతుల్యతకు కారణమవుతున్నారని మండి పడింది. ప్రభుత్వానికి లీజు, రాయల్టీ చెల్లించకుండా వ్యాపారం చేస్తున్నా మైనింగ్, పోలీసు, రెవెన్యూ శాఖలు ఏమి చేస్తున్నాయని ఆ సంస్థ చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ప్రశ్నించారు. అక్రమ మైనింగ్ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి జూన్ 7వ తేదీ లోపు రహస్యంగా నివేదిక ఇవ్వాలని నంద్యాల జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు జారీ చేశారు. డోన్ నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో కొందరు 8 చోట్ల మైనింగ్ కోసం లీజును పొందారు. అయితే అనుమతులు లేని చోట తవ్వకాలు జరుపుతున్నట్లు మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని శనివారం లోకాయుక్త సుమోటోగా విచారణకు స్వీకరించింది. అక్రమమైనింగ్ నివారణకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ డైరక్టర్‌తోపాటు నంద్యాల జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చింది. శాఖల వారీగా విచారణ జరపాలని ఆదేశించింది. అక్రమ మైనింగ్‌కు సంబంధించి మైనింగ్ శాఖ డైరెక్టర్ నివేదిక ఇవ్వాలని, రెవెన్యూ, ఇతర అంశాలకు సంబంధించి కలెక్టర్, అక్రమ రవాణాపై ఎస్పీ నివేదికలు ఇవ్వాలని ఆదేశించింది. మైనింగ్ చెక్ పోస్టులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించింది.

డ్వామా సిబ్బందికి స్థానచలనం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా)లో ఎక్సెస్ ఉన్న సిబ్బందిని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ కేటగిరిల్లో శాంక్షన్ పోస్టుల కంటే ఎక్కువగా ఉండటంతో గ్రామీణాభివృద్ధి శాఖ రేషనలైజేషన్ చేపట్టింది. ఈ ప్రక్రియను ముగిస్తూ ఎక్సెస్‌గా ఉన్న సిబ్బందిని వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి ఎక్కువగా ఉన్న ఏపీవోల్లో బి.మాలిక్‌బాషా(పల్నాడు), పి. కుమార్‌సాయినాథ్(ప్రకాశం), వి.జయరాముడు (ఎన్‌టీఆర్ జిల్లా). ఎన్.జుబీబ్(తిరుపతి), కే.వెంకటేశ్వర్లు(తిరుపతి)లను బదిలీ చేశారు. సీవోఅండ్ ఏఏ(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ అకౌంట్స్ అసిస్టెంటు) కేటగిరిలో 53 మందిని బదిలీ చేశారు. ఇందులో 14 మంది నంద్యాల జిల్లాకు వెళ్తుండగా మిగిలిన వారు ఇతర జిల్లాలకు వెలుతున్నారు. ఎక్కువగా ఉన్న సాంకేతిక సహాయకులు(టీఏ) 81 మంది బదిలీ చేశారు. అయితే నంద్యాల జిల్లా నుంచి 12 మంది టీఏలు కర్నూలు జిల్లాకు కేటాయించారు. కర్నూలు జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ కార్యాలయంలో 11 మంది మాత్రమే సీవో అండ్ ఏవో అండ్ ఏఏలను వినియోగించుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వీరు 26 మంది పని చేస్తున్నారు. ఇంజినీరింగ్ కన్సల్టెంట్లతో యశోదరావు, పి.భార్గవి, పెంచలయ్య, భాగ్యరాజు, ఏపీవోలు పి.మధుబాబు, శంకర్‌రావు పీడీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. వీరిని మండలాలకు పంపే విధంగా ఆదేశాలు వచ్చాయి. గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన అదేశాలు తక్షణమే అమలులోకి వచ్చినట్లుగా అధికార వర్గాలు తెలిపాయి.